క్లుప్తంగా

చుండూరు బస్సు సౌకర్యానికి వినతి

తెనాలి అర్బన్: చుండూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ కోరారు. ఈ మేరకు తెనాలి ఆర్టీసీ డిపోలో డీఎం ఎ.రాజశేఖర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుండూరు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం పలు గ్రామాల నుంచి ప్రజలు నిత్యం వస్తుంటారన్నారు. అయితే బస్సులు లేక వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తన్నీరు శ్రీనివాస్, ఎం.వెంకటేష్, హనుమంతరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డిని గురువారం రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఫిబ్రవరి 5న నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. తిరిగి మాతృ జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డెప్యూటీ తహసీల్దారు సిద్దెల హెనాప్రియ, ఏఎస్ఓ వాసుబాబు, ఆర్ఐ జాన్, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది హసీల్దారును సత్కరించారు.

పాఠశాల తనిఖీ



తెనాలిరూరల్: మండలంలోని కొలెవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను తెనాలి ఉప విద్యాశాఖ అధికారి జె.శాంతకుమారి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు తరగతులను నిర్వహించాలన్నారు. డీవైఈఓ వెంట గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పాఠశాల ఇన్‌చార్జి టి.అనంతలక్ష్మి, ఉపాధ్యాయుడు మదన్‌మోహన్ ఉన్నారు.

ఆధార్ శిబిరం పరిశీలన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం-1 కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సవరణల కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో విమాదేవి పరిశీలించారు. ఆధార్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పలు గ్రామాల్లో నిర్వహించే క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు తదితరులు ఉన్నారు.

22 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



వెలగపూడి(తాడికొండ): అక్రమంగా తరలించేందుకు రోడ్డుపై పెట్టిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్‌లెస్ అధికారులు పట్టుకున్న ఘటన తుళ్ళూరు మండలం వెలగపూడి గ్రామంలో జరిగింది. రేషన్ బియ్యం మూటలుగా తరలించేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం అందుకున్న సివిల్ సప్‌లెస్ డీటీ అనిల్ కుమార్ దాడి నిర్వహించారు. మొత్తం 22 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమంగా తరలించడం నేరమని, ఇలాంటి ఘటనలు జరిగితే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బియ్యం దొరికినా తరలించే ముఠాకు చెందిన వ్యక్తులు ఎవరనేది ఇంకా తెలియలేదు.

వాటర్ ట్యాంకర్లపై కేసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో నీళ్లు సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లకు సంబంధించిన పర్మిట్లు, లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్‌లు లేకుండా తిరిగే వాహనాలపై చర్యలు తీసుకోక తప్పదని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో పర్మిట్లు, పన్నులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని మూడు లారీ వాటర్ ట్యాంకర్లు, రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకర్ యాజమానులు తమ వాహనాలకు సంబంధించి అన్ని రోడ్ల పన్నులు, పర్మిట్లు, ఇన్సూరెన్స్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పక కలిగి ఉండాలని లేని పక్షంలో కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

దుకాణం వివాదం..తెనాలిలో కలవరం

- భారీగా మోహరించిన పోలీసులు
- అయినా షాపు నిర్వాహకుడిపై దాడి
- ఆసుపత్రికి పంపకుండా స్టేషనులో ఉంచిన వైనం..
- కోర్టు ఆదేశానుసారం చర్యలకు అధికారుల సన్నాహాలు



సిబ్బందితో బందోబస్తులో సీఐలు సుధాకర్, రమేష్‌బాబు

తెనాలిరూరల్: ఓ షాపు నిర్మాణంలో తలెత్తిన వివాదం పట్టణంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీనిపై కోర్టు తీర్పు వచ్చిన గురువారం పోలీసులు ప్రత్యేక బలగాలను రప్పించి మరీ బందోబస్తు చేయాల్సి వచ్చింది. ఇంత బందోబస్తులోనూ సంబంధిత దుకాణం నిర్వాహకుడిపై కొందరు దాడి చేశారు. తర్వాత అతడి ఇంటిపై రాళ్లు రువ్వి, కారు అద్దాలను ధ్వంసం చేశారు. చట్ట ప్రకారం వ్యవహరించాలంటూ కోర్టు ఆదేశించడంతో ఈ మేరకు.. చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

తెనాలిలోని నందులపేట దాంగే వారి వీధి (జెండా చెట్టు రోడ్డు శివారు)లో అదే ప్రాంతానికి చెందిన అంచె నరేంద్రకుమార్ ఓ ఖాళీ స్థలంలో కొంత కాలం కిందట ఓ షాపు నిర్మించి, వ్యాపారం చేసుకుంటున్నారు. అయితే మున్సిపల్, ఆర్ అండ్ బీ స్థలాన్ని కబ్జా చేసి, దుకాణ సముదాయాన్ని నిర్మించారని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏళ్లుగా అక్కడే నివాసం ఉంటున్న తమను బలవంతంగా ఖాళీ చేయించారని ఆరోపించారు. అయితే చాలా ఏళ్లుగా తాను అక్కడే ఉంటున్నానని, తన షాపునకు సంబంధించి మున్సిపాలిటీకి పన్నులు కూడా చెల్లిస్తున్నానని నరేంద్రకుమార్ కోర్టుకు వెళ్లి స్టేటస్‌కో తెచ్చుకున్నారు.

ఈ క్రమంలో ఈ నెల 12న స్థానిక మహిళలు అధిక సంఖ్యలో షాపు వద్దకు చేరుకుని.. అక్కడ టెంట్ వేసి షాపు తొలగించాలంటూ ఆందోళనకు దిగారు. షాపులో ఉన్న కొన్ని వస్తువులను ధ్వంసం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు చర్చించి, 25వ తేదీన కోర్టు వాయిదా ఉన్నందున అప్పటి వరకు ఎలాంటి ఆందోళనలు చేపట్టవద్దని సూచించారు. దుకాణాన్ని మూసివేయాల్సిందేనని వారు పట్టుబట్టడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు దుకాణానికి తాళం వేశారు.

గురువారం కోర్టు వాయిదా ఉన్న నేపథ్యంలో తీర్పును బట్టి అటు షాపు నిర్వాహకులు, ఇటు స్థానికులు ఆందోళనకు దిగుతారన్న సమాచారంతో పోలీసులు మున్సిపల్ కార్యాలయం వద్ద, నందుల పేటలోని నరేంద్ర కుమార్ షాపు వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. తెనాలి డివిజన్ పరిధిలోని పోలీసులతో పాటు మంగళగిరి బెటాలియన్‌ను రంగంలోకి దించి మోహరింపజేశారు. ఉన్నతాధికారులతో పాటు సుమారు వంద మంది పోలీసులు సాయంత్రం వరకూ మున్సిపల్ కార్యాలయం వద్దే మకాం వేసి, బందోబస్తు నిర్వహించారు. టూ టౌన్, త్రీ టౌన్ సీఐలు ఎ.సుధాకర్, ఎస్.రమేష్ బాబు బందో బస్తును పర్యవేక్షించి, సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు.



ధ్వంసమైన నరేంద్రకుమార్ ఇంటి అద్దాలు

ఇంత బందోబస్తు ఉన్నా ఉదయం నందుల పేటలో షాపు నిర్వాహకుడు నరేంద్రకుమార్‌పై దాడి జరిగింది. సుమారు 30 మంది వరకు అతనిపై దాడి చేసినట్లు సమాచారం. గాయపడిన నరేంద్రకుమార్‌ను ఆసుపత్రికి పంపకుండా పోలీస్ స్టేషనులో ఉంచడంపై విమర్శలు వచ్చాయి. బయటకు పంపితే ఆందోళనకారులు దాడి చేసే అవకాశం ఉంటుందని, అందువల్లే స్టేషన్‌లో ఉంచామని పోలీసులు సమాధానం ఇచ్చారు. మరోవైపు ఆందోళనకారులు నరేంద్రకుమార్ ఇంటికి వెళ్లి రాళ్లతో దాడి చేసి ఇంటి, కారు అద్దాలను ధ్వంసం చేశారు. వీరిలో ఒకరి చేతికి గాయం కాగా వైద్యశాలకు తరలించారు. మరోవైపు షాపు విషయంలో అధికారులు నిబంధనల కనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఏ విధంగా చర్యలు తీసుకోవాలన్న దానిపై మున్సిపల్ అధికారులు చర్చిస్తున్నారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా న్యాయ సలహా తీసుకుని చర్యలకు ఉపక్రమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. షాపు వివాదం విషయం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి వెళ్లిందా? లేదా? అనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తంచేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

తెనాలిరూరల్: పట్టనంలోని నందుల పేటలో అనధికార కట్టడం విషయంలో తలెత్తిన వివాదం దాడికి దారితీసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తనపై సుమారు 20 మంది దాడి చేసి గాయపర్చారంటూ బాధితుడు అంచె నరేంద్రకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్ గురువారం రాత్రి తెలిపారు.

28న అర్చక సంఘ సమావేశం

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు అర్చక సంఘం సభ్యులు డి. ప్రసన్నమూర్తి, ఆర్. పూర్ణానందశాస్త్రిలు తెలిపారు. ఈ మేరకు సంయుక్తంగా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో నూతనంగా అర్చక బ్రాహ్మణ సమాఖ్య సంఘం సభ్యులను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన రోడ్లను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. పట్టణంలోని బుర్రిపాలెం, మెయిన్, బోసు రోడ్లను గురువారం ఆమె సందర్శించారు. రోడ్ల విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అలాగే మురుగు కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వలను బాగు చేసేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దానిని నేటికీ అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కొనసాగించడం అభినందనీయమన్నారు. మురుగు కాల్వలను ప్రక్షాళన చేయడం వల్ల వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా వెంటనే వెళ్లిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈలు రాజు, ఫణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

- మురుగు కాల్వలో వ్యర్థాలు వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీ, చినరావూరులో జరుగుతున్న పూడిక తీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. మురుగు కాల్వలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. అలాగే బయటకు తీసిన వ్యర్థాలను అక్కడి నుంచి శివారు ప్రాంతాలకు వెంటనే తరలించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రామచంద్రరావు, ఏఈ రాజు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తొలి దశలోనే మచ్చలు గుర్తించాలి

ఫిరంగిపురం: రాగి రంగుమచ్చలను తొలి దశలోనే ఆరోగ్య సిబ్బంది గుర్తించి తెలియజేయాలని జిల్లా ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్ బాబు అన్నారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని బేతపూడి, ఫిరంగిపురం, వసంతనగరం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది 60 ఏళ్లకు పైబడిన వారికి వేస్తున్న బీసీజీ టీకాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు గురువారం వేసే ఐరన్ సిట్రోజ్, గ్రామాల్లో ఎల్‌సీడీ ప్రోగ్రాం జరుగుతున్న తీరును పరిశీలించినట్లు తెలిపారు. బీసీజీ టీకాలు ఇప్పటి వరకు ఎంతమందికి వేశారనే సమాచారాన్ని సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అల్లంవారిపాలెం పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ సిట్రోజ్ మాత్రలు మింగించారు. అనంతరం లెప్రసీ సర్వే నిర్వహించే ప్రాంతాలకు వెళ్లారు. ఇంటింటికీ తిరిగి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట వైద్యులు ఫరీనాబేగం, శ్వేత, ఆరోగ్యసిబ్బంది ఉన్నారు.



పిల్లలకు ఐరన్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ శ్రావణ్‌బాబు

విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి , ఉండవల్లి సెంటర్‌లో తొలగించిన భరతమాత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు గురువారం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ డీసీపీ అశోక్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకట్రావుతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు విగ్రహాల ఏర్పాటుకు స్థలాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. గతంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఈ విగ్రహాలను తొలగించామని తెలిపారు. ప్రస్తుతం ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామని వివరించారు. తాడేపల్లి బకింగ్‌హామ్ కెనాల్ వద్ద భరతమాత విగ్రహాన్ని, ఉండవల్లి సెంటర్‌లో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేసేందుకు మంత్రి నారా లోకేష్‌కు కాపు జాగృతి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని, ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడంపై నియోజకవర్గ కాపు జాగృతి సంఘం అధ్యక్షులు జొన్న రాజేష్ హర్షం వ్యక్తం చేశారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంటీఎంసీ టౌన్ ప్లానింగ్ డీసీపీ అశోక్ కుమార్

పునీత అన్నాంబ మహోత్సవాలు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం పునీత అన్నాంబ మహోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపాల్ సిస్టర్ జి.విమల మేరీ మాట్లాడుతూ మేరీ మాత తల్లి అయిన అన్నమ్మ పిల్లలకు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో కూడిన విద్యాబుద్ధులను నేర్పించడంలో ఆదర్శమూర్తి అని కొనియాడారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ సిస్టర్ అమలమేరీ జోస్పిన్ మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ చదువుల తల్లిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు సిస్టర్ ఝాన్సీ, ఇతర అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అతిసార వ్యాధిపై అవగాహన సదస్సు

తెనాలి అర్బన్: అతిసార వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ స్కూల్‌లో గురువారం అతిసార వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతే అతిసారం నుంచి రక్షిస్తుందని తెలిపారు. శుభ్రత అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలని, అందరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా చూడాలన్నారు. చెత్తను మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల అతిసార బారిన పడతారని తెలిపారు. నీళ్ల విరోచనాలు అయితే వెంటనే వైద్యశాలలకు వెళ్లాలని చెప్పారు. ఈ సమావేశంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, హెచ్‌వీ విజయకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

గంబూషియా చేపలతో దోమల నియంత్రణ

పార్కులోని చెరువులో చేపలను వదిలిన మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: దోమల లార్వాను నిర్వీరియం చేయడానికి గంబూషియా చేపలు ఎంతో దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చినరావూరు సత్యనారాయణ పార్కులోని చెరువులో గురువారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ చేపలను చెరువులో వదలడం వల్ల దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. పట్టణంలోని వివిధ చెరువులు, కాల్వలు, బావుల్లో వీటిని వదలనున్నట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, డెంగీ, మెదడువాపు వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. దోమలను నియంత్రిస్తే చాలా వరకు రోగాలను అరికట్ట వచ్చని తెలిపారు. 15వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారంతో చినరావూరు పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కుమార్ సహకారంతో ఆట వస్తువులు పార్కులో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పెదలంక వెంకటేశ్వరరావు, మట్లపూడి రాజేశ్వరరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఉద్యానవన శాఖాధికారి శేషుబాబు పాల్గొన్నారు.



చెరువులో చేపలను వదులుతున్న చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్మన్‌లు హరిప్రసాద్, నాగవేణి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తెనాలిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సంగం జాగర్లమూడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీఫ్, జలజీవన్ మిషన్ కో-ఆర్డినేటర్ తేజ్ సంగీత్ విద్యార్థులకు సూచించారు. జల జీవన్ మిషన్ డీపీఎంయూ ఆధ్వర్యంలో మండలంలోని అంగల కుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు, వైద్యులు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదాయ వనరుగా మారిన సెల్లార్లు

- రోడ్లపైనే వినియోగదారుల వాహనాల పార్కింగ్
- నిత్యం వాహన రాకపోకలకు అంతరాయం
- ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్, పోలీస్ అధికారులు





పట్టణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని సెల్లార్‌లలో ఏర్పాటు చేసిన దుకాణాలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల సెల్లార్లు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. వీటిని పార్కింగ్ కోసం ఉపయోగించాల్సి ఉన్నా.. అవేమి పట్టనట్లు కొందరు భవన యజమానులు వ్యవహరిస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించకపోవడంపై విమర్శలకు వెల్లువెత్తుతున్నాయి. దుకాణాలకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది.

తెనాలి పట్టణంలో సుమారు వందకు పైగా షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి వాహనాల పార్కింగ్ నిమిత్తం సెల్లార్లు నిర్మించారు. అయితే వీటిలో ఎక్కువ భాగం భవన యజమానులు వాటిని అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరైతే సెల్లార్లు నిర్మించకుండా షాపులను మాత్రమే నిర్మించి వాటి ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇలాంటి షాపింగ్ కాంప్లెక్స్‌లపై చర్యలు తీసుకుంటామని చెప్పడం మినహా.. చేసిందేమీ లేదు. బోసు రోడ్డు, గాంధీ చౌక్ వంటి ప్రధాన కూడళ్లలో ఉన్న అనేక షాపింగ్ కాంప్లెక్స్‌లకు పార్కింగ్ సదుపాయం లేదు. ప్రజలు అందులోని షాప్‌లకు వెళ్లాలంటే సమీపంలోని రోడ్లపై తమ వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోంది.

గంటల కొద్ది ట్రాఫిక్

తెనాలి పట్టణంలో సాధారణంగా ట్రాఫిక్ సమస్య ఎక్కువనే చెప్పవచ్చు. పట్టణం విస్తరిస్తున్న రీతిలో రోడ్ల విస్తరణ జరగపోవడం...షాపింగ్ కాంప్లెక్స్‌లలో పార్కింగ్ సదుపాయం లేకపోవటంతో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. ప్రతి రోజు సాయంత్రం వేళ బోసురోడ్డు, గాంధీచౌక్, బుర్రిపాలెం రోడ్డు, సత్యనారాయణ టాకీసు రోడ్డులో ట్రాఫిక్ జాం అవుతుంది. పండుగల సమయంలో అయితే దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది.

వెలువెత్తుతున్న విమర్శలు

సాధారణంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలంటే పార్కింగ్, ఇతర వసతులు కల్పిస్తామనే హామీతో మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, కొందరు మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ.. పార్కింగ్ సదుపాయం లేకపోయిన షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతులు ఇస్తున్నారు. పోలీసు అధికారులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఇలాంటి షాపింగ్ కాంప్లెక్స్‌ల నివేదికను గతంలో సిద్ధం చేశారు. వాటిని మున్సిపల్ అధికారులకు అందజేసి, భవన యజమానులకు నోటీసులు ఇవ్వాలని కోరారు. కానీ, అది ఇప్పటి వరకు సాధ్యపడలేదు. కొన్ని కాంప్లెక్స్‌లను పార్కింగ్ సదుపాయం లేకుండా నిర్మించారు. ఇలాంటి వాటిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా..ఆ దిశగా ఇప్పటి వరకు అడుగు పడలేదు. ఇప్పటికైన మున్సిపల్, పోలీస్ అధికారులు సమన్వయంతో భవన యజమానులకు నోటీసులు అందజేసి, చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సెల్లార్‌లో వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు



సెల్లార్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి వ్యాపారాలు నిర్వహించకూడదు. వాటిని పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించాల్సి ఉంది. కానీ పట్టణంలోని పలు చోట్ల సెల్లార్‌లలో వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆ కాంప్లెక్స్‌ల వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

-బండి శేషన్న, కమిషనర్, పురపాలక సంఘం, తెనాలి.

28న ఉచిత కంటి వైద్య శిబిరం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సాలన బస్టాండు సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో 28న సదావర్తి అన్నదాన సత్రం ఫౌండర్ ట్రస్ట్ (నుదురుపాడు) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ట్రస్ట్ నిర్వాహకులు గుర్రం నాగేశ్వరరావు, ఉషారాణిలు గురువారం ఈ వివరాలు తెలిపారు. ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల, చిన్నకాకాని నేత్ర వైద్య నిపుణులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. శుక్లాలు ఉన్న వారిని గుర్తించి పెద్ద ఆసుపత్రులలో ఉచితంగా ఆపరేషన్లు చేసి, మందులు అందజేస్తారని చెప్పారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్రం జాషువా చిరస్మరణీయుడు



లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాషువా కవిత కంఠం విలక్షణమైందని అన్నారు. సాహితీ వేత్త ముప్పాళ్ళ పి.ఎస్.ప్రసాదరావు, ప్రముఖ కవి జమదగ్ని మాట్లాడుతూ జాషువా ప్రజా కవి, తెలుగు ప్రజల కవి అని నిత్య జీవితంలో కానీ సాహితీ జీవితంలో కానీ ఎన్ని కష్టాలు ఎదురైనా ఓటమి ఆయన దరి చే రలేదని ధీరత్వంతో నిబ్బరంగా నిలబడ్డారని తెలిపారు.